


# ఖాళీ ఘటా

ఉదయం తొమ్మిదిగంటల వేళ. ఎండాకాలం ప్రారంభమయ్యా కాక మునుపే కుండపోతగా కురిసి వెళ్ళిన వానలమూలంగా వాతావరణం చల్లగా ఉల్లాసంగా ఉంది. బురుజుపైన కాపలా సిపాయిల్లా నిటారుగా నిల్చున్న తాటి చెట్లల్లో రెపరెపలాడుతున్న మట్టల సవ్వడి తప్పితే ఊరు వూరంతా ప్రశాంతంగా వుంది. ఉన్న నాలుగు వీధుల్లోనూ జనసంచారం లేదు. జనం తక్కువనిగాదు. సేద్యం చేయగలిగిన కాపు జనమంతా పొలాల్లోనే ఉండిపోయింది. పిల్లా జెల్లా బడికి వెళ్ళిన సమయం. నీరెండ దాని స్వభావానికి అనుగుణంగా వుంది. అది చురుగ్గానే వున్నా, ఇంకా తడితగ్గని చెమ్మనేలవల్ల, గుబురుగా విస్తరించి శాఖోపశాఖలతో వూరినంతా పొదివి పట్టుకున్న చింతచెట్లవల్ల దాని ప్రభావం అంత బాగా వుడకడంలేదు. తామరపాడు చూడచక్కని వూరు. ఆవేళప్పుడు ఆ వాతావరణంలో మరింత అందంగా వుందది. వెన్నెల్లో ఎన్నూరు, మంచులో హిమశైల కుగ్రామం, పాపికొండలో గోదావరి మున్నగు దృశ్యాలను నీటిరంగుల్లో చిత్రించడానికి ఉత్సహించే చిత్రకారుడెవరైనా ఆ వూరిని చూడడం తటస్థిస్తే చూచిన వెంటనే స్కెచ్ గీసుకోడానికి సిద్ధం కాగలడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

కానీ కలవారి అలివేణి కమలారాణి అయిదు నిమిషాల కొకసారి గుమ్మందాకా వచ్చి బయటికి తొంగిచూడడానికి, వసారాలోకి వచ్చి వీధివైపు పరకాయించి చూడడానికి, మేడముంగిట పందిరి క్రిందకి వచ్చి వూరి పొలిమేరల్లోకి చూడడానికి కారణం పల్లెతాలూకు ప్రకృతి సౌందర్యంపట్ల ఆమెకున్న ప్రలోభమేనని మాత్రం చెప్పలేము.

అలాగని సౌందర్యాన్ని ఆరాధించే గుణం కమలారాణిలో లేదని

గాదు. ఇప్పుడామె ధ్యాస ఆ వైపుకు ప్రసరించడం లేదంతే! కమలారాణి నిరీక్షణలో సతమతమైపోతోంది. అదీ అసలు విషయం.

కమలారాణి కోపం కట్టలు త్రెంచ్చుకుంటోంది. ఎటొచ్చీ ఆ కోపాన్ని ఎలా ఎవరిపైకి ప్రదర్శించాలన్నదే ఆమెకు పాలుపోకుండావున్న విషయం. ఆ కాడికి ఆమె ఒకసారి లోపలికి వెళ్ళి తల్లి దగ్గర తన ఉక్రోషాన్ని వెళ్ళగ్రక్కనే వెళ్ళగ్రక్కింది.

"ఎవరమ్మా ఈ ముసలి మల్లయ్య! ఈ ముఖం తప్పితే మరెవరూ దొరకలేదా ఈ వూరి పోస్టాఫీసుకు! రైలు ఎనిమిది గంటలకల్లా స్టేషను కొస్తుందని తనే చెబుతాడు. తొమ్మిది గంటలకైనా తిరిగి రాగూడదూ?"

"నాలుగుమైళ్ళు నడచిరావాలి గదమ్మా? వస్తాడు. ఎందుకు రాడు? ఆ రావడం మరి కొంతవేగంగా రావచ్చుననుకో! కానీ పరుగెత్తి రావాలని లేదుగదా?"

"పోనీ, ఓ సైకిలు కొనుక్కోవచ్చుగా?"

"ఆ ముప్పైరూపాయల బోడి ఉద్యోగానికి సైకిలు కూడానా! కొనుక్కుంటాడే అనుకో! ఆ ముసలాడికి దాన్ని త్రొక్కడమైనా చేతనవునో కాదో! అదెవరు చూచారు?"

తటాలున తల్లి దగ్గరినుంచీ వెనక్కు వచ్చేసింది కమలారాణి. ఈవిడ గారెప్పుడూ అంతే! ఆకుకందకుండా,పోకకుపొందకుండా జవాబులు చెబుతుంది.

గడియారం వైపు చూచింది కమలారాణి. గంట తొమ్మిదిన్నర. ఎంతగా ఆలస్యమైనా తొమ్మిదిన్నరయ్యేసరికి ముసలిమల్లయ్యరాక గ్యారంటీ! అదిగో,తన వూహ నిజమైనట్టుగా గోడ గడియారం గూడా మ్రోగుతోంది.

మళ్ళీ ద్వారం దగ్గరికి వెళ్ళి వెలుపలికి చూచింది కమలారాణి.

ఆ మూడంతస్తుల మేడకు ఎట్టయెదుట పెంకుటింటి వసారాలోకి తెరుచుకునే చిన్నగదే ఆవూరి పోస్టాఫీసు.మూసిన తలుపులతో అది మూసి నట్టే వుంది.

గ్రుడ్డిలో మెల్లగా బ్రాంచి పోస్టుమాష్టరు రామలింగం మాత్రం పందిరి క్రింద తచ్చాడుతూ కనిపించాడు.

"ఏమండీ మాష్టారూ! మీ ముసలి రన్నరింకా రానేలేదా?" ప్రశ్నించింది కమలారాణి.

"అవునమ్మ రాలేదింకా!" తొణక్కుండా బదులు చెప్పారు రామలింగం.

"ఎందుకొస్తాడు! దారిలో చెట్టు చెట్టు దగ్గర ఆగి ఉడతల్ని పలకరించాలట! బండ బండ దగ్గరా ఆగి తొండల్ని ఎంచుకోవాలట! పుట్ట పుట్ట దగ్గరా ఆగి ఏ ఆకు ఏ మందుకు పనికొస్తుందో తెలుసుకోవాలట! ఐనా అతణ్ణని ఏం లాభం? అతగాడి కీ ఉద్యోగం యిప్పించిన వారిననాలి...."

"అదేమిటండీ బుల్లెమ్మగారూ! వాడి కీ ఉద్యోగం యిప్పించింది పెదబాబుగారేకదా! ఐనా మీ కెలా తెలుస్తుంది లెండి! మీరు నిన్నగాక మొన్న పుట్టారు. ఈ వూరికి పోష్టాఫీసు రావడం, రన్న రుద్యోగాన్ని పెదబాబుగారు మల్లయ్య కిప్పించడం-యిదంతా ముప్ఫైయేళ్ళ క్రిందటి మాట!"

ఇంకా నయం! బి. సి. నాటిమాట అన్నారుకాదు. ప్రపంచంలో ప్రభుత్వాలు మారుతున్నాయి.పరిపాలకులు మారుతున్నారు. కానీ ఈ వూరి పోష్టాఫీసు, ఈ ముసలి రన్నరు మల్లయ్య, ఈ నూలు దారం కళ్ళద్దాల పోస్టు మాష్టరు- వీళ్ళుమాత్రం మారేటట్టులేదు.

"పోనీలెండి బుల్లెమ్మగారూ! ముసలాడు పాపం, పడుతూ లేస్తూ రావాలిగదా! ఐనా యింకెంతకాలం! లేదు లేదంటే యిక రెండేళ్లు చేయగలదేమో ఉద్యోగం! ఆలస్యంగా వస్తున్నాడని నాన్నగారితో చెప్పకండి, కోప్పడతారు........"

నాన్నగారి ద్వారా ఆమాత్రం పని చేయించాలన్న పట్టుదల కమలారాణికి లేకపోలేదు. ఒకసారి ఆమె ఆయన దగ్గర రిపోర్టు చేసింది గూడా. "అలాగా! ఎక్కడ వాడు మల్లయ్య? రానీ, వాడి పని చెబుతాను. ముసలి పీనుగ, ఉద్యోగంపైన ఖాతరుండ నక్కర్లేదా వాడికి?" అంటూ శేషాద్రి గారు మండిపడ్డారు.

కానీ తీరా మల్లయ్య టపా తీసుకొచ్చి బల్లపైన పెట్టేసరికి శేషాద్రి గారి కోపం తిరుగుముఖం పట్టింది-"ఒరే మల్లయ్యా!ఆ నల్లావు సరిగ్గామేత తినడం లేదట! దానికేమైందో చూడు. నీకు తెలియకపోతే వెటర్నరీ కాంపౌండరు వీరాసామిని పిల్చుకరా" అన్నారు.

అబ్బే, లాభంలేదు. నాన్నగారికి వెయ్యి పనులు. ఒకరిపైన తీరా మారా కోప్పడ్డానికైనా ఆయనకు తీరికుండదు.

కమలారాణి మళ్ళీ ఇంటి లోపలికి వెళ్ళబోతుండగా ఒక ముఖ్యమైన విషయాన్ని బయటపెట్టాడు రామలింగం.

"మామూలు రోజుల్లోనే మన వూరికి టపా రావడం ఆలస్యం గదండీ బుల్లెమ్మగారూ! ఈరోజు మరీ ఆలస్యం గావచ్చు.ఎక్కడో గూడ్సు రైలు పడిపోయిందట. టపా బండి రెండు గంటలు లేటట!"

* * *

కమలారాణి అంత ఆతురతగా యెవరి ఉత్తరం కోసమైతే నిరీక్షిస్తున్నదో ఆ అమ్మాయి పేరు జలదబాల!

కమలారాణికి కాలేజీలో యెందరో స్నేహితురాండ్రున్నారు. సీత, సావిత్రి, అనసూయ, సరోజ ఇత్యాదిగా వున్న ఆ స్నేహితురాండ్రందరూ ఒక యెత్తయితే,కమలారాణికి జలదబాల మాత్రం ఒక యెత్తు.ఆ పేరంటే చాలా యిష్టం కమలారాణికి! జలదబాల. ఎంత చక్కని పేరు!

నిజానికి మిగిలిన స్నేహితురాండ్రకు, జలదబాలకు ఒక గొప్ప భేదం మాత్రం లేకపోలేదు. ఏటిపొడుగునా పొదల్లో రకరకాల పువ్వులుంటాయి. మనసు పడితే వాటిని కోసుకోవచ్చు. ఆఘ్రాణించవచ్చు.తలలో పెట్టుకోవచ్చు. సీత, సావిత్రి వగైరా స్నేహితురాండ్రు ఈ ఏటి పొదల్లో పువ్వులలాంటివాళ్లు. జలదబాల సంగతలా కాదు. ఆమె దూరంగా చెట్ల గుబురులో దాగివున్న మొగిలిపువ్వు, ఎక్కడో వుండకపోలేదన్న ఊహ, అనుభూతి పరిమితుల్లోకి వస్తున్న దాని కమ్మని తావి. యివి తప్పితే మొగిలి పువ్వు కంటికి కనిపించదు. సీత ఎలా వుంటుందో కమలారాణి చెప్పగలదు. సావిత్రి ఎలాంటిదో కమలారాణి చెప్పగలదు. జలదబాల స్వరూప స్వభావాదులను గురించి కమలారాణికి తెలిసింది చాలా తక్కువ. ఏవో వూహలు,అంచనాలు తప్పితే కమలారాణికి జలదబాల ఎలా ఉంటుందో తెలియదు. ఎలాంటిదో తెలియదు.

ఆడపిల్లగాకుండా కమలారాణి ఓ పడుచువాడై ఉండివుంటే జలదబాల నీ కథలోకి ప్రవేశపెట్టడం ఇంత కష్టమై వుండేదిగాదు. జలదబాల అతగాడి ఊహాసుందరి అని పేర్కొంటే టకీమని సరిపోయేది.

మరైతే కమలారాణికి, జలదబాలకు స్నేహం ఏర్పడ్డం ఎలా సాధ్యమైందని ఇక్కడెవరికైనా సందేహం కలగవచ్చు. నిజానికి ఏ ఐదేళ్ళకి మునుపైతే ఒక కమలారాణికి,మరొక జలదబాలకు ఇలా స్నేహం ఏర్పడడమనేది సాధ్యమై ఉండేదికాదేమో! నాలుగేళ్ళ క్రిందటి మాట—అప్పుడు కమలారాణి కాన్వెంటులో చదువుకుంటోంది. శేషాద్రిగారు నెలనెలా ఆమెకో మనియార్డరు పంపుతూండేవారు. అవసరాల కన్నిటికీ సరిపోయి అదనంగా ఆమెకు కొంత మిగులుతుండేది గూడా! అందువల్ల ఆమెకు, తండ్రిగారికీ, మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలే జరిగేవిగావు. ఆ మాట కొస్తే బాహ్య ప్రపంచంలోనుంచి ఉత్తరాలద్వారా ఆమెను పలకరించేవాళ్ళే లేరు. కాన్వెంటులో కొందరమ్మాయిలకైతే రోజుకో ఉత్తరమైనా వస్తుంది.మరికొందరు వారానికొకటి రెండు ఉత్తరాలైనా కళ్ళ జూస్తారు. వాళ్లు జాబులకోసం వేచి చూడడం, పోస్ట్‌మేన్ దగ్గరినుంచీ వాటిని గ్రహించడం, దూరంగా వెళ్ళి చదువుకోవడం. చదువుకున్న తర్వాత ఆత్మీయులైన వారికి చూపించడం - యిలాంటి చిన్న చిన్న సంఘటనలన్నీ కమలారాణిని తెగ వూరించేవి.

కమలారాణికి అక్కచెల్లెళ్ళు లేరు. ఇద్దరు అన్నయ్యలు మాత్రం వున్నారు. పెద్దన్నయ్య మాజీ జమీందారుగారి ఏకైక పుత్రికను వివాహమాడి అక్కడే స్థిరపడ్డాడు. రెండో అన్నయ్య ఏవో వ్యాపారపు పంటల పైన పరిశీలన జరిపే నిమిత్తం విదేశాల్లో వున్నాడు. ప్రత్యుత్తరాలమాట దేముడెరుగు. వాళ్ళకు తన ఉత్తరాలను చదివేపాటి తీరికైనా వుండదేమోనని కమలారాణి అనుమానం. ఎటొచ్చీ కుటుంబంలో తాను ఉత్తరాలు వ్రాయదగ్గ వ్యక్తిగా ఆమె కొక్కరుమాత్రం కనిపించారు. ఆవిడే ప్రభావతమ్మ-కమలారాణి తల్లి.

ఉత్తరాలు వ్రాసి వాటికి ప్రత్యుత్తరాలు పొందాలన్న ఉబలాటం మనసులో రగులుతున్న ఆ తొలినాటి రోజుల్లో తల్లికొకటి రెండు జాబులు వ్రాసి చూసింది కమలారాణి! ఫలితం చాలా అసంతృప్తికరంగా తేలింది. ప్రభావతమ్మ ప్రత్యుత్తరం వ్రాయనూ లేదు. వ్రాయకనూ పోలేదు. పోస్టుమాస్టరు రామలింగంచేత నాలుగు గీతలు మాత్రం వ్రాయించింది.

ప్రభావతమ్మకు చదువు రాకకాదు. చిన్ననాడు ఏదో కొద్దిపాటి చదువుకుని, సంసార నిర్వహణలోపడ్డ తర్వాత ఆమె చదువును మరిచిపోయే ప్రయత్నంలో వుంది. మీదుమిక్కిలి కుమార్తె తనకు జాబు వ్రాయడం అదొక చిన్నపిల్లల చిలిపి చేష్టగా తోచిందేమో, ఆమె వుండి వుండి కొంత ఆలస్యంగానే బదులు వ్రాయించింది.

"చిరంజీవి కమలారాణికి ఆశీర్వాదములు.

"ఇక్కడ క్షేమం, అక్కడ నీ క్షేమాలు తెలిపేది. నీ జాబులు రెండూ అందాయి. నీ స్నేహితురాండ్రను గురించి వ్రాశావు. మనుషులన్న తర్వాత అందరూ ఒక్కమాదిరిగా వుండరు. ఎవరెట్లా వున్నా మనకు నష్టమయ్యేది లేదు. పోగా కాలేజీలో ఏవో విశేషాలు జరిగాయని గూడా వ్రాశావు. ఆ మాత్రం విశేషాలైనా లేకపోతే, పాపం అక్కడ హాస్టల్లో మీకైనా యెలా ప్రొద్దుపోతుంది? ఇక్కడ నా పనులతో నాకు ప్రొద్దే చాలడం లేదు. నువ్వు అక్కరగా చదువుకుంటున్నావు గదూ! ఇంతకంటే వ్రాయదగ్గ సంగతులు లేవు. ఉంటాను...."

అంతటితో తల్లికిక జాబువ్రాసి ప్రయోజనం లేదన్న నిర్ణయానికి సులభంగానే రాగలిగింది కమలారాణి.

లేదంటే ఆమె కొకటే గత్యంతరం మిగిలింది. తన చిరునామాకు తానే ఒక జాబు వ్రాసి పోస్టు చేసుకోవచ్చు. మరునాడు దర్జాగా దాన్ని పోస్టుమేన్ దగ్గరినుంచీ గ్రహించవచ్చు. అంతకుమించి తనకీ ఉత్తరాల ముచ్చట తీరే ఉపాయం కనిపించదు.

కమలారాణికి ఏడుపొచ్చింది.

కానీ ఆ ఏడుపు కలకాలం నిలవలేదు.

మ్యూజిక్ మిస్ట్రెస్ చూడామణి పుణ్యమా అని అది అనతికాలంలోనే పటాపంచలైంది.

ఉపాధ్యాయిను లందరిలోనూ పుష్కలంగా ఉత్తరాలందుకొనే వ్యక్తి చూడామణి. ఆ ఉత్తరాలకు సంబంధించి ఊహలు, అపోహలు కూడా దండిగా లేకపోలేదు. ఒక రోజావిడ మాటల సందర్భంలో తనకు స్విజర్లాండునుంచి కూడా ఉత్తరాలు వస్తుంటాయని ఓ విశేషం వెల్లడించింది,

ఆశ్చర్యపడటానికి అంతకంటే గొప్ప విశేషం అక్కరలేదు కమలా రాణికి. తను చదువుకున్న భూగోళశాస్త్రమంతా నిజమే అయితే ఎక్కడో ఐరోపాఖండంలోని ఒక చిన్నదేశం స్విజర్లాండు. అంత దూరదేశం నుంచీ ఉత్తరాలు వ్రాయడానికి చూడామణి కక్కడ బంధువు లెవ రుంటారు?....

ఈ సందేహాన్ని విన్న చూడామణి పక్కున నవ్వేసింది. "బంధువులే వుండాలిటమ్మా కమలారాణీ! ఏం, స్నేహితులు రాయగూడదా ఉత్తరాలు? స్విజర్లాండులో నాకో స్నేహితురాలుంది. పెన్ ఫ్రెండ్ అన్నమాట!"

"పెన్ ఫ్రెండా!" మళ్ళీ వ్యాఖ్యానాన్ని ఆపేక్షించింది కమలారాణి.

"అవునుమరి. ఆమె పేరు మార్గరేట్ సుసెన్నా. అధమపక్షం నెలకో ఉత్తరమైనా వ్రాస్తుంది. నేనూ ఎప్పటికప్పుడు బదులు వ్రాస్తు న్నాను........"

"ఆమెగారిని మీరు యెప్పుడు, యెక్కడ, యెందుకు కలుసుకున్నారు మేడమ్?"

"కలుసుకోలేదమ్మా కమలారాణీ! కేవలం ఉత్తరాలు వ్రాసుకోవడం వరకే మా స్నేహం. అస లీ కాలం స్నేహం యొక్క స్వభావమే యింత!...."

అదేం వింతో తనకు బోధపడడం లేదని కమలారాణి ముఖమే చెబు తోంది. అందువల్ల చూడామణికి సాకల్యంగా వివరించక తప్పిందిగాదు.

"చూడమ్మా కమలారాణీ! పెన్ ఫ్రెండ్ అంటే కలం స్నేహితు (రాలు)డు అని భావం! ప్రపంచంపైన మొదట టపా సౌకర్యాలు పుట్టి వెంటనే పెన్‌ఫ్రెండ్స్ పుట్టారు. వీళ్ళు ఒకరినొకరు కలుసుకోరు. మరైతే ఈ కలం స్నేహం ఎలా ఏర్పడుతుందని ప్రశ్నిస్తే అందుకు కొన్ని ప్రత్యేక సంస్థలు, కొన్ని పత్రికలూ వున్నాయి! మనకొక కలం స్నేహం కావాలని వాటికొక ఉత్తరం వ్రాస్తే చాలు. మిగిలిన తతంగాలన్నీ అవే నిర్వహిస్తాయి...."

"అలాగైతే నాకో పెన్ ఫ్రెండును సంపాదించి పెడతారా మేడమ్?" ఎంతో ఆసక్తితో అడిగింది కమలారాణి.

"ఓ, అదెంతపని!" అంది చూడామణి.

అనడమేగాదు. అన్నంత పని గూడా చేసింది చూడామణి. నెల రోజులు తిరగక మునుపే కమలారాణి కొక కలం స్నేహితురాలు లభ్యమైంది.

ఈ స్నేహాన్ని యేర్పాటు చేసిన పత్రికద్వారా కమలారాణికి తన క్రొత్త స్నేహితురాలిని గురించి కొద్దిపాటి వివరాలు మాత్రమే తెలిశాయి— పేరు జలదబాల. వయస్సు పదిహేడు, పి.యు.సి, చదువుకుంటోంది. చక్కగా పాడుతుంది. బంకించంద్ర, రవీంద్ర, శరత్ బాబుల నవలలంటే చాలా యిష్టం. సంగీత, సాహిత్యాలు, సుందర ప్రకృతి దృశ్యాలను చూడటం, పుణ్య క్షేత్రాలకు వెళ్ళి రావడం యివన్నీ- ఆమె కున్న అభిరుచులు.

ఆ తరువాత జలదబాల కమలారాణికి వ్రాసిన మొదటి ఉత్తరంలో తనను గురించి మరికొన్ని వివరాలను తెలియజేసింది.

—(జలదబాలకు, కమలారాణికి జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల నన్నిటినీ యిక్కడ యధాతధంగా పొందుపరచటం సాధ్యంకాదు. ఎందుకంటే వాళ్ళు తమ అభిప్రాయాలకు ప్రకటనార్థం వాడుకున్న సాధనం యింగ్లీషు భాష. భాష ఏదైనప్పటికీ భావమే ప్రధానం గనుక ఆ యీ లేఖాంశాలను యిక్కడ తెనిగింపు చేయడం జరుగుతోంది.)

"ప్రియమైన కమలారాణికి—

"స్నేహలత పత్రికద్వారా నిన్ననే నీ చిరునామా తెలిసింది. అప్పటినుంచీ నీకు జాబు వ్రాసే ప్రయత్నంలోనే వున్నాను. కానీ ఎలా వ్రాయాలో తోచడంలేదు. ఎలాగైతేనేం, యిలా మొదలుపెట్టేశాను. మరైతే యిది ఎలా కొనసాగుతుందో చెప్పలేను.

"మా నాన్నగారి పేరును నువ్వు నా చిరునామాలో చూసేవుంటావు. అసలు మేము బెంగాలీవాళ్ళం. ఉద్యోగరీత్యా మా నాన్నగారు పదేళ్ళనుంచీ యిక్కడే వుంటున్నారు. బహుశా యిక్కడే రిటైరు గూడా అవుతారు. నన్ను బాగా చదివించాలని, మంచి ఉద్యోగం చూసిపెట్టాలని ఆయన

వుద్దేశం. మా అమ్మ కేమో నేను చదువుకోవడం యిష్టం లేదు. మంచి సంబంధం చూచి పెళ్ళి చేయాలని ఆవిడ కోరిక. మరైతే నా యిష్టం ఏమిటో అదిగూడా చెప్పాలిగదూ! నాకూ చదువుకోవడమే యిష్టం. కానీ కాలేజీ పుస్తకాలను గాదు. అయినా తప్పదు. ఎంత యిష్టం లేకపోయినా జీవితంలో తప్పనిసరిగా కొన్ని పనులు చేయవలసి వుంటుందని యెక్కడో ఓ నవ లలో చదివినట్లు జ్ఞాపకం...."

జాబులు వ్రాయడం గూడా ఒక కళేనని యెవరో చెప్పగా విని "అబ్బే అదీ ఒక కళేనా?" అనుకున్న కమలారాణి జలదబాల ఉత్తరం చదివిన మీదట విస్మయచకితురాలై పోయింది. ఇంచుమించుగా తనకు సమ వయస్కురాలు ఐనా జలదబాల యెంత బాగా వ్రాయగలిగింది, తన చేత గాదేమో!

కానీ ఒకటి రెండుసార్లు వ్రాసి చూసుకున్నాక కమలారాణికి తన ఉత్తరం గూడా బాగానే వున్నట్టు తోచింది. మళ్ళీ శుద్ధ ప్రతి వ్రాసి పోస్టు చేసింది. వారం రోజుల్లో దానికి ప్రత్యుత్తరం వచ్చింది.

కొంతకాలం గడిచేసరికి కమలారాణికి ఈ ఉత్తరాల కళలో వున్న గొప్ప రహస్యం ఒకటి విస్పష్టంగా తెలియవచ్చింది. వ్రాయాలన్న కోరిక ఒకటే ముఖ్యంగానీ, ఉత్తరంలో ఏమైనా వ్రాయవచ్చు. ఉదాహరణకు కలం చేతికి తీసుకునేసరికి చంద్రు డుదయించాడనుకోండి!

"బయట వెన్నెల కాస్తోంది" అంటూ ప్రారంభించవచ్చు. (ఆకా శాన మబ్బు లలముకుని వున్నాసరే, ఉత్తరాన్ని యిలాగే ప్రారంభించ వచ్చు. తప్పులేదు. ఫలానా రోజు. ఫలానా వేళప్పుడు, ఫలానా చోట మేఘాడంబరం వల్ల వెన్నెల కనిపించ లేదని అవతలి వ్యక్తి కెలా తెలు స్తుంది?)

"గదిలోపల చల్లగా ఫాన్ తిరుగుతోంది...."(గదిలోపల ఉక్కగా వుండి, ఉమ్మడంవల్ల బట్టలు తడిసిపోతున్నా సరే, ఆ యిబ్బందిని బయట పెట్టనక్కర్లేదు.)

"గది వెలుపలి తోటలో (అక్కడ తోటలాంటి దొకటి వుండితీరా లన్న నిర్బంధమేమీ లేదు.) చల్లటిగాలి అశోకవృక్షాలతో (లేదా, సుర పొన్న లేదా గున్నమామిడిచెట్లతో) మంతనాలాడుతోంది."

వెన్నెల కాయకపోవచ్చు. చల్లటిగాలి వీచకపోవచ్చు. తోటగానీ, అందులో చెట్లుగానీ లేకపోవచ్చు. కానీ అవన్నీ ఉన్నట్టు వ్రాస్తేనే బాగుం టుందనిపిస్తే నిస్సందేహంగా అలా వ్రాయవచ్చు. ఇది కవి సమయం లాంటి రహస్యం.

ఒకసారి జలదబాల తనకు గులాబీపువ్వులంటే ఇష్టమని వ్రాసింది. ఒకానొకప్పుడు భారత ప్రభుత్వం జాతీయ విహంగంకోసం ఆలోచించి నట్టుగా అప్పుడు కమలారాణి తనకు నచ్చిన పువ్వుల్ని ఎన్నిక చేసుకోవలసి వచ్చింది. మామూలుగా మార్కెట్టులో దొరికే పువ్వులన్నిటినీ వదిలిపెట్టి ఆమె మొగిలి పువ్వుల్ని ఎన్నుకుంది. కానీ ఆ మొగిలి పువ్వును ఆంగ్ల భాషలో ఏమంటారో ఆమెకు తెలిసింది కాదు. ఆమె జాబులో ఆ పదాన్ని అలాగే యింగ్లీషు అక్షరాలలో వ్రాసిపెట్టింది. ఆ పువ్వు ఢిల్లీనగరంలో మాత్రమేగాదు, యింగ్లీషు డిక్షనరీలోగూడా కనిపించనందుకు విస్తుపోతూ జలదబాల ప్రత్యుత్తరం వ్రాసింది. అప్పుడు కమలారాణి మొగిలిపొదల్ని గురించి, వాటిలోని పువ్వుల్ని గురించి, ఆ పరిసరాల్లో తిరిగే మిన్నాగుల్ని గురించి తన ఉత్తరంలో రెండు పుటలు నింపించింది.

కాలక్రమాన కమలారాణికి ఉత్తరాలు వ్రాయడం నీళ్ళు త్రాగినంత సులభమనిపించింది. వస్తువుకోసం వెదకడం శుద్ధ టైమ్‌వేస్టు. "కాదేదీ కవిత కనర్హం" అన్నట్టుగా కాలేజీలో లెక్చరర్లు, కలుసుకున్న స్నేహితు రాండ్రు, చూచిన సినిమాలు, చదివిన పుస్తకాలు-వీటిలో దేన్ని గురించైనా ఉత్తరం వ్రాయవచ్చు. కావల్సిన వెసులుబాట్లు రెండే రెండు- ఒకటి తీరిక, రెండోది ఓపిక. అవి రెండూ తనకు యిబ్బడిముబ్బడిగా వుండనే వున్నాయి.

మానసిక అనుబంధాలు చాలా చిత్రమైనవి. ఆలోచనను ఎవరిపై నయితే కేంద్రీకరిస్తామో వారే మానసాకాశ మంతటా ఆవరించుకుంటారు. నిరంతర ధ్యానంవల్ల భక్తునికి భగవంతునితో సామీప్యం, సారూప్యం, సాయుజ్యం సిద్ధిస్తుందని చెప్పటంలోని ఆంతర్యం ఇదేనేమో? జలదబాలను గురించి తలపోయడంలో కమలారాణి కెంతకాలం గడిచిందో చెప్పలేము. ఉత్తరాలద్వారా ఆమె స్నేహితురాలి అభిరుచుల్ని క్షుణ్ణంగా గాకపోయినా,

కొంతవరకూ అవగాహన చేసుకోగలిగిందన్న మాటను కాదనలేము. అందువల్ల దూరానికి అతీతంగా వాళ్ళిద్దరిమధ్య సాన్నిహిత్యం నెలకొన్నట్టయింది. కమలారాణికి జలదబాల తన దరిదాపుల్లో నీడలా మసలుతున్నట్టే వుండేది.

లోకంలో ఏ నిజమైనా సరే అది నూటికి నూరుపాళ్లు నిజంగా వుంటుందనుకోవడం కేవలం అంధ విశ్వాసమేమో ననిపిస్తుంది. ఎందుకంటే-కమలారాణి జలదబాలను కలుసుకోలేదనడం ఎంత నిజమో, కలుసుకున్నదనడం గూడా అంతే నిజం! ఆమె స్నేహితురాలితో కలిసి ఉద్యానవనాల్లో విహరించింది. నదుల్లో పడవ ప్రయాణం చేసింది. తాజ్‌మహలును వీక్షించింది. అజంతా, ఎల్లోరాలకు వెళ్ళింది. ఐతే ఈ సమాగమాలన్నీ ఊహాలోకంలోనూ, స్వప్న ప్రపంచంలోనూ జరిగాయి. వాస్తవిక ప్రపంచంలోమటుకూ కాదు.

ఆ మాటకొస్తే వాస్తవిక ప్రపంచంలో తాను జలదబాలను కలుసుకునే అవకాశం ఏర్పడవచ్చునని కమలారాణి వూహించనే లేదు.

ఉన్నట్టుండి జలదబాల దగ్గరినుంచి ఉత్తరం వచ్చింది. ఏదో ప్రభుత్వ వ్యవహారంపైన వాళ్ళ నాన్నగారికి మదరాసులో పని తగిలిందట. దక్షిణ దేశంలోకూడా కొంతకు కొంత చూచి నట్టవుతుందని పనిలో పనిగా ఆయన సతీసుతులనుగూడా తన వెంట తీసుకొచ్చేశాడట. మదరాసునుంచీ ఉత్తరం వ్రాసింది జలదబాల. వారం రోజుల్లో తాను తామరపాడు వస్తుందట, ఏ స్టేషనులో రైలు దిగాలో, అక్కడినుంచీ ఏ బస్సు ఎక్కాలో తెల్పమని కోరింది.

కమలారాణికి గొంతుకలో వెలగకాయ పడ్డట్టయింది. జలదబాలకు ఆతిధ్య మివ్వలేక కాదు. కానీ ఆమె నెలరోజులకు మునుపు వచ్చివుండినా బాగుండేది లేదా నెలరోజులు తాళి వచ్చివున్నా బాగుండేది. ఎటూ గాకుండా సెలవుల్లో తానీ పల్లెలో వుండగా యిక్కడికి రావాలని చెబుతూ తనను యిబ్బంది పెడుతుందేమిటి జలదబాల! నెలరోజుల్లో తనకు కాలేజీ తెరుస్తారు. పట్టణంలో తమకు ఆధునిక సౌకర్యాల కన్నింటికి నెలవైన ఓ

బంగళా వుంది. చవులూరగా భోజనం చేసిపెట్టే వంటవాడున్నాడు. ప్రత్యే కంగా ఒక కారు తన చెప్పు చేతల్లో వుంది. జలదబాలను షికార్లకు తీసు కెళ్ళవచ్చు. సినిమాలు చూపించవచ్చు. మిత్రురాళ్ళ యిళ్ళకు తీసుకెళ్ళి పరి చయం చేయవచ్చు. ఈ తామరపాడులో ఏముంది? ఈ వూళ్ళో ఆమెకు పొద్దెలా పోతుంది?

అందుకే యిలా బదులు వ్రాసింది కమలారాణి:

"ప్రియమైన జలదా! నీ రాక నా కెంతైనా ఆనంద దాయకం. దీన్ని మరపురాని మధురమైన సందర్భంగా మార్చుకోవాలి మనం. ఎలా గంటావా, అదే చెబుతున్నాను. నువ్వీ తామరపాడుకు రావద్దు. ఇది చాలా చిన్నవూరు. పట్టణాల్లో సొసైటీ అంటారే- అలాంటి దిక్కడ కనిపించదు. రాత్రి ఏడు కొట్టేసరికే అర్ధరాత్రి అయినట్టుంటుంది. మగవాళ్ళు మోటుగా వేషాలు వేస్తారు. కటువుగా మాట్లాడుతారు. ఏవో డబ్బులు దాచిపెట్టినట్టు పొలాల్లోకి పరుగెడుతుంటారు. ఇక ఆడవాళ్ళకైతే ఆ పొగచూరిన గోడ ల్లోనే స్వర్గం కనిపిస్తుంది. ఈ వాతావరణం నువ్వు భరించలేవు. కనుక నేనొక పని చేద్దామనుకుంటున్నాను. ఖచ్చితంగా నువ్వెప్పుడు రాబోతు న్నావో తెలిస్తే ఒకటి రెండు రోజులు ముందుగా నేను పట్టణం వెళ్తాను. అక్కడ మాకో మేడవుంది. అసలు నేను పుట్టింది ఈ వూరే అయినా పెరగడం, చదవడం అంతా అక్కడే జరిగింది. నువ్వు చక్కా- రైల్లో వచ్చి స్టేషనులో దిగవచ్చు. స్టేషను దగ్గర మా కారు నీ కోసం వేచి యుంటుంది...."

కమలారాణి ఈవుత్తరం వ్రాసి పోస్టుచేసిఅయిదురోజులైంది. నిన్ననే రావలిసింది ప్రత్యుత్తరం. ఎందుచేతనో రాలేదు. ఈ రోజు తప్పకుండా వస్తుంది- ఏడీ, ఈ ముసలి మల్లయ్య రావడమే ఆలస్యం!

మల్లయ్య- పదిన్నర గంటలకు గాని రాలేదు.

జలదబాల యిలా వ్రాసింది—

"ప్రియమైన కమలా! నీ మాటను పాటించలేకపోతున్నందుకు నన్ను

మన్నించు. నాకు పట్టణాలకంటే పల్లెలంటేనే యిష్టం. పట్టణాల్లో ఏముంది? అవి ఎక్కడికీ ఒక్కలాగే వుంటాయి. ప్రకృతి సౌందర్యంలోని వైవిధ్యాన్ని చూడాలంటే పల్లెలోనే చూడాలి. నా కోసమని ప్రత్యేకంగా పెద్ద ఏర్పాట్లేవీ చేయవద్దు. ఉండదలచుకున్న నాలుగు రోజులు నేను మీ పల్లెలోనే ఉండ గలను....''

*　　　　*　　　　*

సమీక్ష చదివిన తర్వాత సినిమాకు వెళ్తే, ఒక్కొక్కప్పుడు ఆశ్చ ర్యమైనా కలగవచ్చు- ఆశాభంగమైనా కలగవచ్చు. సమీక్షలోకన్నా సినిమా బాగుంటే ఆశ్చర్యం; బాగుండకపోతే ఆశాభంగం. జలదబాలను చూచి నప్పుడు కమలారాణికి ఆశ్చర్యం, ఆశాభంగం రెండూ కలిగాయి. జలద బాల అంత అందంగా వుంటుందనిగానీ, అంత నిరాడంబరంగా వుంటుం దనిగానీ కమలారాణి అనుకోలేదు. తెల్లటి చీర, అలాంటిదే జాకెట్టు, చిన్న సైజు కర్ణభూషణాలు, నుదుట జ్యోతిలాంటి బొట్టు-ఈ మాత్రం వేషంలోనే ఆమె మనోజ్ఞంగా వుంది. కారు దిగగానే ఆమె కమలారాణిని కౌగలించు కొంది. అరమరికలు లేకుండా కుశల ప్రశ్నలడిగింది. అమ్మగారిని, నాన్న గారిని చూపెట్టమంది. శేషాద్రిగారు ఇంట్లో లేరు. జలదబాల ప్రభావతమ్మకు సాష్టాంగంగా నమస్కరించింది. పీటలపైకి వెళ్ళబోతున్న వధూవరులు సైతం తల్లిదండ్రులకు నమస్కరించడానికి బిడియపడటం గమనించివున్న కమలారాణికి జలదబాల చర్య విడ్డూరంగా కనిపించడంలో ఆశ్చర్య మేముంది?

ఇతరుల్ని మనం ఎలా వుండాలని ఆశిస్తామో అందుకు విభిన్నంగా వున్నప్పుడు విడ్డూరంగా వుండడమేగాదు; మనకు చిరాకు గూడా కలుగు తుంది. కమలారాణి ఉద్దేశంలో జలదబాల మరింత విలువగలిగిన చీర కట్టుకుని వుండవలసింది. మెడకు, చేతులకు బంగారం పెట్టుకుని వుండ వలసింది. జలదబాల, ఇక్కడికి వట్టి జలదబాలగా రావడంలేదు. కమలా రాణి స్నేహితురాలుగా వస్తోంది, మరి అలాంటప్పుడు యిలా నాసిరకం హంగులతో ప్రత్యక్షమైతే తన కెంత నామోషీగా వుంటుంది!

అందువల్ల తన హుందాతనాన్ని కాపాడుకోవడం కోసమయినా కమలారాణి కొన్ని అబద్ధాలు చెప్పక తప్పని పరిస్థితి ఏర్పడింది-ఎంత కలిగిన వాళ్ళయినా కాలేజీ అమ్మాయిలు ఇలాగే వుంటారు. పేరంటానికి వెడుతున్న పల్లెటూరి అమ్మలక్కల్లా వున్ననగలన్నీ ఒంటిపైకి తెచ్చుకోరు. అక్కడ ఎంత నిరాడంబరంగా వుంటే అంతగొప్ప! లేకుంటే జలదబాలకు లేని చీరలా, నగలా! వాళ్ళ నాన్న గొప్ప ఉన్నతోద్యోగి, వాళ్ళింట్లో మనిషి మనిషికీ ఒక కారు వుండవచ్చునని తన వూహ. వాళ్ళ స్వంత వూరు కలకత్తా. అక్కడ ఎస్టేటుగా పేర్కొన దగిన భూ స్థితి గూడా వుంది....

ఈ అబద్ధాలపుట్ట ఒక గొప్ప షాక్ ట్రీట్ మెంటులాగా పనిచేసింది. కాలం చాలా పరిమితం. అనగా తాత్కాలికం. సాయంకాలానికల్లా ఈ అబద్ధం కోటకు బీట పడింది.

ఆ రోజు మధ్యాహ్నం భోజనాలవేళ ప్రభావతమ్మే స్వయంగా కుమార్తెకు, ఆమె స్నేహితురాలికి వడ్డిస్తోంది. కూతురు మిత్రురాలితో యింగ్లీషులో తడవుకోకుండా మాట్లాడేస్తుంటే ఆమెకు చూడ ముచ్చటగా వుంటుంది. ఆ చోటు వదిలిపెట్టి దూరంగా వెళ్ళడానికే బుద్ధిపుట్టడం లేదు. ఆ రసవత్తర ఘట్టంలో ఓ విచిత్రమైన సంఘటన జరిగింది.

"పచ్చడి చాలా బాగుంది. మరి కొంచెం వేస్తారండీ?" హఠాత్తుగా అడిగింది జలదబాల, ప్రభావతమ్మ వైపు చూస్తూ.

"అమ్మదొంగా! నీకు తెలుగొచ్చు నన్నమాట!" తల్లీ కూతుళ్ళ గొంతుకలు రెండూ ఆశ్చర్యంతో ఒక్కటైపోయాయి.

తన వచ్చీరాని తెలుగును గురించి యిలా వివరించింది జలదబాల-ఎప్పుడైనా కమలారాణిని కలుసుకుంటే ఉన్నట్టుండి తెలుగులో మాట్లాడి ఆశ్చర్యం కలిగించాలని తాను చిరకాలంనుంచి అనుకుంటూ వుండేదట! అందుకు తగ్గట్టుగా ఢిల్లీలో వాళ్ళ పొరుగింట ఓ తెలుగువాళ్ళ కుటుంబం

చేరిందట. ఆ పొరుగింటి యిల్లాలి మూలంగా మొదట కొన్ని పదాలు, క్రమంగా చిన్న చిన్న వాక్యాలు నేర్చుకోగలిగిందట. వెరశీ- ఈ భాషలో తాను పెద్దగా చర్చల్లో పాల్గొనే అవకాశం లేకపోయినా మామూలు సంభాష ఇల్లో పాల్గొనగలదట!

జలదబాల నేర్చుకోవడం వల్ల తెనుగు భాషకేదో కొత్త సిరి ఒరిగి పోయినట్టుగా సంబర పడిపోయింది ప్రభావతమ్మ.

తనతో మాట్లాడాలన్న లక్ష్యంపైన జలదబాల పనిగట్టుకొని ఒక భాషను నేర్చుకోడం కమలారాణికి గూడా అమితానందం కలిగించింది.

కానీ ఈ ఆనందం నిలిచింది గూడా కొద్ది సేపటివరకే! సాయం కాలమయ్యీ కాకమునుపే దీనికి అఘాతం తగిలింది,

స్నేహితురాలిని రేడియోకు అప్పగించి వంటింటివైపు వచ్చిన కమలా రాణికి తల్లి పిలుపు వినిపించింది:

"ఓ మాట చెబుతానుగానీ కూర్చో కమలా!" అంది ప్రభావతమ్మ. ఇలాంటి ఉపోద్ఘాతాలు కమలారాణికి సుపరిచితమే! ఏవైనా పుల్ల విరుపు మాటలన్నట్టయితే ప్రభావతమ్మ యిలాగే ఉపక్రమిస్తుంది.

"నువ్వెందుకలా అనుకున్నావోగానీ నీ స్నేహితురాలికేమంత సిరి సంపదలు లేవట! ఇందాకా నువ్వు స్నానానికి వెళ్లావు గదూ! అప్పుడడి గాను. వాళ్ళ నాన్నగారేదో మంచి ఉద్యోగమే చేస్తున్నారట! అయిదు వందల రూపాయలు జీతమట! ఐనా ఢిల్లీలో అయిదు వందలు ఏ మూలకు సరిపోతుంది? పైగా అయిదారుగురు సంతానమాయె! పుచ్చుకొక్క పని మనిషినిగూడా పెట్టుకోకుండా సంసారం లాగేస్తున్నారంటే యిక వాళ్ళ స్థితి గతుల సంగతి తెలిసి పోవడం లేదా? వాళ్ళమ్మకు మాత్రం ఓ నెక్లెస్ వుందట! అదీ వాళ్ళ పుట్టింటి వాళ్ళు పెట్టిందట! వాళ్ళవూరు కలకత్తా అన్నావు గదూ! కాదట, మాటిమాటికి 'కాళీఘటా' అంటుందీమె! చూడగా చూడగా వీళ్ళ వాలకమంతా 'ఖాళీఘటం' లాగా కనిపిస్తోంది నాకు...."

మౌనంతో, ఉదాసీనతతో మాత్రమే తల్లి సందేహాలకు బదులు చెప్ప గలిగింది కమలారాణి. గొంతుకలో వెలగకాయ పడ్డట్టుంటే అంతకంటే ఏం చేస్తుంది? ఎరగకపోయి అబద్ధాలు చెప్పినందుకు ఇదే శిక్ష-చిక్కి-బిక్క-రించడం! ఐనా జలదబాలను గురించి తాను చెప్పిన వివరాలపైన అజమాయిషీ చేయవలసిన అవసరం ఈవిడ కేమొచ్చింది? ఈవిడ అడిగిందనుకో, అవిడికైనా కాస్త ఇంగిత జ్ఞానముండొద్దూ! తమకు మేడలు, కార్లు ఉన్నాయని చెబితే తన సొమ్మేం పోతుంది? వాళ్ళ కున్నాయో లేవో ఎవరు వెళ్ళి చూడబోతున్నారు?

కమలారాణి తిరిగి వెళ్ళేసరికి జలదబాల గదిలో లేదు, హాల్లోనూ కనిపించలేదు. నడవలో చెత్త వూడుస్తున్న సుబ్బమ్మ "ఆ యమ్మగారు డాబాపైకి వెళ్ళారండీ బుల్లెమ్మగారూ!" అంది. 'ఎందుకూ?' అనుకుంది కమలారాణి. డాబాపైన నిల్చుని తనను గురించిన నిజాలను ఊరికంతా విన పడేటట్టు ఎలుగెత్తి చెప్పడానికి కాదు గదా!

కమలారాణిగూడా డాబా పైకి దారి దీసింది.

పుచ్చపువ్వులాంటి వెన్నెల. పిట్టగోడ కానుకుని పల్లెవైపు పరకాయించి చూస్తోంది జలదబాల. వీధుల రాజ్యంలో కుర్రవాళ్ళ ఏలుబడి అప్రతిహతంగా సాగుతోంది. నాలుగిళ్ళ కవతల గుడిసె ముందర కాకివెదురు పందిరి క్రింద మంచంపైన పడుకుని జంగం బసవయ్య కాలజ్ఞాన తత్వాలు పాడుకుంటున్నాడు. వీధి కటువివర భజన గుడి ఎదుట మండపంలో కూర్చుని మంగలివాళ్లు సన్నాయి వాయిస్తున్నారు. కొంగులు పట్టుకున్న పసిపాపల్ని మెల్లగా నడిపించుకుంటూ ముత్తయిదువులు కొందరు గుడి లోపలికి వెళ్తున్న దృశ్యంగూడా అక్కడికి లీలగా కనిపిస్తోంది.

అడుగుల సవ్వడి వినిపించగానే పెదవి కదిపింది జలదబాల— "మనమూ అక్కడికి వెళ్ళొద్దామా కమలా!"

"మనమా! అక్కడికి వెళ్ళడమా!" జలదబాల అజ్ఞానాన్ని అపహసిస్తూ గొల్లున నవ్వేసింది కమలారాణి. "మనం వీధంట వెళ్తుంటే వూరు వూరంతా విరగబడి చూడడానికా జలదా! వద్దమ్మా వద్దు!"

"ఐతే మీదు వీధివెంట వెళ్ళనే వెళ్ళరా కమలా!" తెల్లబోతూ అడిగింది జలదబాల.

"పట్నం నుంచీ కారులో రావడం, దిగి యింట్లోకి వచ్చేసెయ్యడం, అంతటితో సరి! ఈ వూరితోనూ, ఈ వీధులతోనూ మాకేం పని తగలడు. అంతెందుకూ, ప్రహరీ గుమ్మానికెదురుగ్గానే వున్నాయి గదా, ఆ నాలుగైదిళ్ళు-ఆ యిళ్ళలో ఎందరున్నారో, ఎవరెవరున్నారో నాకు తెలియదంటే నమ్ము."

ఓ నిముషం పాటు మౌనంగా వుండిపోయిన తర్వాత హఠాత్తుగా అడిగింది జలదబాల-"ఈ వూరి వాళ్ళకు, మీకు విరోధాలేమైనా వున్నాయా కమలా?"

"మాతో విరోధాలా? ఆ మాత్రం దమ్ము లెవరికున్నా యిక్కడ జరుగుబాటుంటే అంత పనిచేసే వాళ్ళేమో! అదే లేనిది! త్రాగేవి మా బావి నీళ్ళు, నడిచేవన్నీ మా పొలాలు. అసలీ యిళ్లు కట్టుకోవడానికి ఉచితంగా జాగా గూడా మా వాళ్ళెవరో యిప్పించిందేనట! ఆ గుడి కట్టించిదెవరో చెప్పనా జలదా, మా తాతగారు!"

"అలాగైతే ఆ గుడిలో వున్నది మీ దేవుడే నన్నమాట!"

"ముమ్మాటికీ మా దేవుడే! సందేహమా జలదా?"

"కానీ, ఆ దేవుడి ముఖం మాత్రం మీరు చూడరు, ఎందుకమ్మా మీ కంత కోపం?"

ఉదయం లేవగానే ఎవరి ముఖం చూశానో అనుకుంది కమలారాణి. ఒకటికి రెండు పరాజయాలు!

జలదబాల తామరపాడులో వుండదలచుకున్న అయిదు రోజుల్లో ఒక్క రోజు మాత్రం గడిచింది.

మరు నా డెలా గడుస్తుందో తెలియకుండా పడుకుని గాఢంగా నిద్ర పోయింది జలదబాల. తెల్లవారింది. స్నేహితురాలికి కులాసాగా కాలక్షేపం చేయడానికి ఏవోకొన్ని ఏర్పాట్లు చేయనేజేసింది కమలారాణి. కారులో రెండు మైళ్ళు దూరానవున్న తమ మామిడితోపుకు తీసుకెళ్ళింది. అక్కడ ఏటిగట్టున కొబ్బరి తోటలో షికార్లు త్రిప్పింది. లేత టెంకాయ కొట్టించి ఎడ నీటితో సేదదీర్చింది. ప్రొద్దు వాటారిన తర్వాత మూలగదిలోనుంచీ పాత గ్రామ ఫోను వెలుపలికి తీయించి, దుమ్ము దులిపించి కపిలవాయి రామనాధశాస్త్రి కీర్తనలను, టంగుటూరి సూర్యకుమారి పాటలను స్నేహితురాలికి వినిపించింది.

కానీ ఆ రోజు రాత్రి పడకపైన మేను వాల్చినప్పుడు యిప్పుడు పేర్కొన్న ఉదంతాలేవీ జలదబాలకు జ్ఞప్తిలో లేవు, ఓ సరిక్రొత్త వాతావరణం, అందులోనుంచీ ఒక క్రొత్త పాత్ర ఆమె మనసులో పీఠం వేసుకుని కూర్చున్నాయి,

ఎవరా పాత్ర? ఏమా కథ?

మామిడితోపునుంచీ తిరిగి వచ్చేసరికి గంట పన్నెండు కావచ్చింది. స్నానమూ, భోజనమూ ముగిసేసరికి ఒంటి గంటయింది. పోగా గ్రామ ఫోను తతంగం ప్రారంభం గావడం సాయంకాలం నాలుగు గంటలప్పుడు. మధ్యలో మూడుగంటల కాలానికి జలదబాల డైరీ ఏమని బదులుచెప్పేటట్టు?

శేషాద్రిగారి కుటుంబ వ్యక్తులకైతే అది విశ్రాంతివేళ. అనగా నిద్రా సమయం. నిద్ర వచ్చినా రాకున్నా కదలకుండా పడకపైన పడుకోవలసి వుండటం తప్పనిసరి! పడుకోగానే నిద్రపోయింది కమలరాణి. జలదబాలకు పగటి నిద్ర అలవాటులేదు. ఆమె లేచి మెల్లగా ఈవలకు వచ్చింది. నిద్రా

గారాలకు దూరదూరంగా నౌకర్లు కొందరు వాళ్ళ పనులేవో వాళ్ళు చేసుకుంటున్నారు. ఉబుసుబోక ఒక పుస్తకం చేతికి తీసుకొని పెరట్లోకి వెళ్ళింది జలదబాల. బావికి వేసిన రాట్నం తిరుగుతున్న చప్పుడు తప్ప పెరటిలో గూడా సందడి లేదు. జలదబాల బావివైపు చూచింది. అలా చూచినప్పుడే ఆ క్రొత్త వ్యక్తి ఆమెకు దృగ్గోచరమైంది.

ఆ నీళ్ళు చేదుతున్న అమ్మాయికి పదిహేడు, పద్ధెనిమిదేళ్ళుంటాయేమో! చెవికి వేసుకున్న లోలాకులు కదిలి పోతుండగా, దువ్వుకున్న తలలోనుంచీ ముంగురులు చెదరి పోతుండగా, వయసు పొంకంవల్ల మళ్ళీ మళ్ళీ పమిట సర్దుకోవలసిన అవసరం ఏర్పడుతుండగా ఆమె నీళ్ళు చేదుతోంది. మనిషి అందంగానేవున్నా ఆ అందంలో అలిసిపోయిన లక్షణాలు గోచరిస్తున్నాయి. ముఖాన చిరుచెమటగూడా క్రమ్ముకుంది. 'ఎవరీ అమ్మాయి? అనుకుంది జలదబాల. గడిచిన ఒకటి రెండు రోజుల్లో యిలాంటి అమ్మాయిని ఈ మేడలో చూచినట్టు గుర్తులేదు.

ఆమెతో తన కేమీ పనిలేనట్లుగానే బావి దగ్గరికి వెళ్ళింది జలదబాల. వంగి బావిలోపలికి తొంగి చూచింది. ఊరు మిట్టపైన వుందేమో, నీళ్ళు బాగా లోతుగా వున్నాయి. పంపులోనుంచీ నీళ్ళు దూకడం చూస్తుంటే వినోదంగానే వుంటుంది. బావిలోనుంచీ ఒక్కొక్క వూపుతో ఒక్కొక్క బారదూరం పైకొస్తున్న బకెట్టుకేసి చూస్తున్నా వినోదంగానేవుందిగానీ ఈ వినోదం వెనుక నున్న విషాదం సంగతి?

"ఎవరికి నీళ్లు?" అప్రయత్నంగా అడిగింది జలదబాల.

"మాకేనండీ చిన్నమ్మగారూ! ఈ ఊరికంతా మంచినీళ్ళ బావి యిదొక్కటే! ఇదిగో, ఈ ప్రహరీ గుమ్మంగుండా లోపలికివచ్చి నీళ్ళు చేదుకపోతుంటాం. ఎంతలేదన్నా త్రాగడానికొకటి రెండు కడవల నీళ్ళు కావాలిగదా!"

గారాలకు దూరదూరంగా నౌకర్లు కొందరు వాళ్ళ పనులేవో వాళ్ళు చేసుకుంటున్నారు. ఉబుసుబోక ఒక పుస్తకం చేతికి తీసుకొని పెరట్లోకి వెళ్ళింది జలదబాల. బావికి వేసిన రాట్నం తిరుగుతున్న చప్పుడు తప్ప పెరటిలో గూడా సందడి లేదు. జలదబాల బావివైపు చూచింది. అలా చూచినప్పుడే ఆ క్రొత్త వ్యక్తి ఆమెకు దృగ్గోచరమైంది.

ఆ నీళ్ళు చేదుతున్న అమ్మాయికి పదిహేడు, పద్ధెనిమిదేళ్ళుంటాయేమో! చెవికి వేసుకున్న లోలాకులు కదిలి పోతుండగా, దువ్వుకున్న తలలోనుంచీ ముంగురులు చెదరి పోతుండగా, వయసు పొంకంవల్ల మళ్ళీ మళ్ళీ పమిట సర్దుకోవలసిన అవసరం ఏర్పడుతుండగా ఆమె నీళ్ళు చేదుతోంది. మనిషి అందంగానేవున్నా ఆ అందంలో అలిసిపోయిన లక్షణాలు గోచరిస్తున్నాయి. ముఖాన చిరుచెమటగూడా క్రమ్ముకుంది. 'ఎవరీ అమ్మాయి? అనుకుంది జలదబాల. గడిచిన ఒకటి రెండు రోజుల్లో యిలాంటి అమ్మాయిని ఈ మేడలో చూచినట్టు గుర్తులేదు.

ఆమెతో తన కేమీ పనిలేనట్లుగానే బావి దగ్గరికి వెళ్ళింది జలదబాల. వంగి బావిలోపలికి తొంగి చూచింది. ఊరు మిట్టపైన వుందేమో, నీళ్ళు బాగా లోతుగా వున్నాయి. పంపులోనుంచీ నీళ్ళు దూకడం చూస్తుంటే వినోదంగానే వుంటుంది. బావిలోనుంచీ ఒక్కొక్క వూపుతో ఒక్కొక్క బారదూరం పైకొస్తున్న బకెట్టుకేసి చూస్తున్నా వినోదంగానేవుందిగానీ ఈ వినోదం వెనుక నున్న విషాదం సంగతి?

"ఎవరికి నీళ్లు?" అప్రయత్నంగా అడిగింది జలదబాల.

"మాకేనండీ చిన్నమ్మగారూ! ఈ ఊరికంతా మంచినీళ్ళ బావి యిదొక్కటే! ఇదిగో, ఈ ప్రహారీ గుమ్మంగుండా లోపలికివచ్చి నీళ్ళు చేదుకపోతుంటాం. ఎంతలేదన్నా త్రాగడానికొకటి రెండు కడవల నీళ్ళు కావాలిగదా!"

ఎందుకోగానీ జలదబాలకు ఆమెతో మరికొంతసేపు మాట్లాడాలని పించింది. ఏం మాట్లాడాలో చటుక్కున స్ఫురించలేదు. మళ్ళీ అప్రయత్నం గానే ప్రశ్నించేసింది—

"పెళ్ళయిందా నీకు?" తీరా అడిగిన తర్వాత తన అవివేకానికి సిగ్గు పడుతూ మునిపంటితో పెదవి కోరుక్కోక తప్పిందిగాదు.

"ఇది ఏడోనెలండీ చిన్నమ్మగారూ?" చిరునవ్వుతో సమాధానం వచ్చింది.

"నీ పేరు?"

"రాజి."

లేత్రాయంలోనే ఒక ఇంటి కోడలై, కొద్దిరోజుల్లో ఒక బిడ్డతల్లి గూడా కాబోతున్న ఆ అమ్మాయిని గురించి మరికొన్ని వివరాలు తెలుసు కోవాలన్న కుతూహలం జలదబాలకు లేకపోలేదు. కానీ అడగాలంటే అందుకు తగ్గమాటలేవో తోచడంలేదు. ఐనా ఆమె ఏదోవిధంగా అడగడం మాత్రం మానలేదు.

"తెలిసిందండీ చిన్నమ్మగారూ! ఇది మా పుట్టిల్లా, అత్తారిల్లా అని అడుగుతున్నారు. ఇది నేను పుట్టిన వూరే. నన్ను రాజంపేటలో యిచ్చారు. అక్కడ మా రెడ్డి పోలీసు కొలువు చేస్తున్నాడు...."

"మా రెడ్డి అంటే?"

"ఓహో, అదా అండీ! మేము మొగుణ్ణి మొగుడని చెప్పుకోము. మా రెడ్డి అంటాము. కమ్మవాళ్ళయితే మా నాయుడు అంటారు. బ్రాహ్మలు మా అయ్యవారు అంటారు...."

"అలాగా! బాగుంటుంది, బాగుంటుంది."

రాజి విరగబడి నవ్వేసింది-"బాగుంటాది అనగూడదండీ చిన్నమ్మ గారూ! బాగుంది అనాలి." కడవను చంకకెత్తుకుంటూ-"ఇంట్లో అందరూ నిద్రపోతున్నారేమో! కాసేపు మా ఇంట్లో కూచుంటారా చిన్నమ్మగారూ!" అంది.

ఆమె ఆహ్వానాన్ని నిరాకరించలేకపోయింది జలదబాల.

వాళ్ళది మూడంకణాల పూరిల్లు. అక్కడే వంట. అక్కడే భోజనాలు. పడుకోవడం గూడా అక్కడే. ఐనా యిల్లు తీర్చిదిద్దినట్టు పరిశుభ్రంగావుంది. పొయిరాజేసి అయిదునిమిషాల్లో కాఫీ సిద్ధం చేసింది రాజి. జలదబాలతో మాట్లాడుతూనే పందిరిలో మల్లెపువ్వులు కోసింది.

తను ఎనిమిదో తరగతి వరకూ చదువుకుందట. అంతకుమించి తామరపాడులో చదువులేదట. వచ్చిన చదువు మరచిపోకుండా యిప్పుడు గూడా వారపత్రికలూ, అవీ చదువుకుంటూ వుంటూందట. అక్కడ అత్తారిల్లు రాజంపేటలో చీనీకాయలు దండిగా దొరుకుతాయట! అరగంటలో అన్ని వివరాలూ క్షుణ్ణంగా చెప్పేసింది.

కట్టిన మల్లెపువ్వులను జలదబాల తలలో పెడుతూ, "దండ భుజాలకు పైగా వ్రేలాడేటట్టుగా పువ్వులు పెడితే మీరెంతో ముద్దొస్తున్నారండీ చిన్నమ్మ గారూ!" అంది.

"మరి, అయితే ముద్దుపెట్టుకోరాదూ?" నవ్వింది జలదబాల.

"అమ్మో, యింకేమైనావుందీ! మా రెడ్డి అసలే పోలీసు. ఇలాంటి తప్పు చేశానని తెలిస్తే తీసుకెళ్ళి జైల్లో పెట్టడూ?" ఆ చిన్న పూరిల్లు నవ్వులతో నిండిపోయింది.

జలదబాల కొక్కటే ఆశ్చర్యం. ఈ అమ్మాయితో తనకున్న పరిచయం ఏపాటిది? ఆరు సంవత్సరాలు కలసివున్న మిత్రులు గూడా మాసిన

కంగా ఎంతో దూరంగా వున్నట్టుగా తోచే ఈ నాగరిక ప్రపంచంలో యిలాంటి స్వచ్ఛమైన స్నేహశీలాన్ని చవి చూడడం తనకు చాలా క్రొత్త అనుభవం!

కానీ దోహదక్రియలు జరిపి ఈ మధురానుభవాన్ని పువ్వులుగా, పిందెలుగా, కాయలుగా పండ్లుగా పండించుకునే యోగం తనకులేదు.

ఎక్కడి రాజి! ఎక్కడి జలదబాల!

కనీసం జాబులు వ్రాసుకుందామన్నా తనకు తెనుగురాదు- ఈమెకు ఇంగ్లీషు తెలియదు. ఎందుకో ఇన్ని భాషలు? ప్రపంచానికంతా ఒకటే భాష వుండిపోతే ఎంత బాగుండును!

ఆ తలపుల్లో తేలిపోతూ ప్రహరీ గుమ్మంగుండా శేషాద్రి గారింటి పెరటితోటలోకి వచ్చింది జలదబాల. బావి దగ్గర సోపుపెట్టి ముఖం కడుక్కుంటున్న కమలారాణి "ఎక్కడికి కెళ్ళావు జలదా! అబ్బో, తల్లో పువ్వులు గూడా పెట్టుకున్నావే! ఎక్కడివవి?" అంది.

"పొరుగింటి అమ్మాయిలేదూ కమలా! ఆమె పిలిస్తే వెళ్ళాను...."

"పొరుగింటి అమ్మాయా! ఎవరది?"

"రాజి! తెలియదా కమలా?"

"ఎవరు? బొద్దుగా సొరకాయలా వున్న అమ్మాయేనా జలదా! ఆమె గారు నిన్ను పిలిచిందా! నన్నెప్పుడూ పిలవదే!"

ఎందుకు పిలవగూడదో, ఎందుకు పిలవదో జలదబాలకు తెలియదు. ఒకవేళ రాజి పిలిస్తే కమలారాణి వెళ్తుందో, లేదో అదీ ఆమెకు తెలియదు. అందువల్ల ఆమె మౌనంగా వూరుకుండిపోయింది. తెలియని విషయాల పట్ల మూకీభావమే మంచిదని జలదబాల నమ్మకం.

రాజితో పరిచయం ఏర్పడిన తరువాత జలదబాల తామరపాడులో గడిపిందల్లా మూడురోజులు మాత్రమే. ఆ మూడు రోజుల్లో వీలు చిక్కినప్పుడల్లా ఆమె రాజిని కలుసుకోకుండా వుండలేకపోయింది.

నూనె వంకాయకూర బాగా కుదిరిందని జలదబాల విస్తరి దగ్గర కూర్చునేదాకా రాజి వదిలిపెట్టిందిగాదు. నూనెవంకాయ బాగానేవుంది. అంతకన్నా బాగున్నది రాజి చూపెట్టిన మమకారం. జలదబాల కేమైనా పెట్టాలన్నది ఆమె కోరిక. పెట్టడానికి వాళ్ళకుపంచభక్ష్యపరమాన్నాలేమున్నాయి?

ఒక మధ్యాహ్నంవేళ రాజి తల్లి శేషాద్రిగారింట కనిపించింది. "రాజి ఏం చేస్తోంది?" అని అడిగింది జలదబాల.

"ఏమీ చేయడంలేదండీ చిన్నమ్మగారూ! అన్నం బొత్తిగా సయించడం లేదంటే నిమ్మకాయ వూరగాయ కోసం వచ్చాను. ఇప్పుడు తీరికలేదని మళ్ళీ రమ్మన్నారు పెద్దమ్మగారు...."

"అలాగా" అంది జలదబాల. అంటూండగా ఆమెకో విషయం జ్ఞప్తికి వచ్చింది, భోజనంచేస్తూ 'ఇది బాగుంది' అని తనంటే—'ఏదీ నిమ్మకాయ ఊరగాయేనా?' అని అడిగి, భోజనాలైన తరువాత ఓ జాడీనిండుగా వూరగాయ వేసుకొచ్చి గదిలో వుంచుతూ "నువ్వు వెళ్ళేప్పుడు దీన్ని తీసుకెళ్ళమ్మాయ్!" అంది ప్రభావతమ్మ....

"ఇక్కడికి కొచ్చావుగదా జలదా! మా వూరెలా వుంది నీకు?"

—జలదబాల మరునాటిఉదయం వెళ్ళిపోతున్నదనగా రాత్రి భోజనానంతరం ప్రశ్నించింది కమలారాణి.

"మీ వూరు చాలా బాగుంది."

"అంటే మేము బాగాలేమా ఏమిటి?"

"మీరు బాగానే వున్నారు. మీకేం కొదవ? మా తాతగారు చెపుతుండే వారు-తెల్లవాళ్ళతో స్వాతంత్ర్యంకోసం పోరాడిన రోజుల్లో మా తాతగారొకసారి సత్యాగ్రహంచేసి జైలుకు వెళ్ళారట! పేరుకు జైలేగానీ అక్కడ అన్ని సౌకర్యాలూ వుండేవట! పుస్తకాలు చదువుకోవచ్చు. రుచిగా భోజనం చేయవచ్చు. హాయిగా పడుకోవచ్చు. ఆనందంగా నిద్రపోవచ్చు. అలాంటి సదుపాయాలన్నీ మీకూ వున్నాయి ..."

అది ప్రశంసో, విమర్శో కమలారాణి కర్థంకాలేదు.

రాజిదగ్గర సెలవు తీసుకోడానికొక అయిదు నిముషాల వ్యవధి మాత్రమే లభ్యమైంది, కళ్ళు కన్నీటి కొలనులు కాగా, కంఠం గద్గదికం కాగా, మాటలు పెగలకుండాపోయి, అదొక అనిర్వచనీయ విషాదానుభవంగా రూపొందింది. చిట్ట చివరకు రాజి అంత ప్రొద్దుటేకోసి కట్టివుంచిన మల్లె పువ్వుల్ని జడలో పెట్టుకుంటూ "నిన్నెలా మరచిపోగలను రాజీ!" అంది జలదబాల.

"మరచిపోకుండా వుండడానికి నేను మీకేమౌతానండీ చిన్నమ్మగారూ!" అంది రాజి.

హేతువాదంలో బదులు చెప్పడానికి వీల్లేని ప్రశ్నలు లోకంలో ఎన్నో వున్నాయి. అలాంటి అసంఖ్యాకమైన ప్రశ్నల్లో యిదీ ఒకటి! ఏమని చెబుతుంది జలదబాల?

* * *

కారు బయల్దేరడానికి సిద్ధంగా వుంది. ప్రభావతమ్మకు, కమలారాణికి నమస్కరించి జలదబాల కారులో అడుగుపెట్టింది. డ్రయివరు సామాన్లన్నీ తీసుకొచ్చి కారులో పెడుతున్నాడు. "ఊరగాయ జాడీ ఎక్కడ? తీసుకొచ్చారా, లేదా?" అంటూ ముందుకొచ్చింది ప్రభావతమ్మ. "ఇదిగో, తెస్తానండీ అమ్మగారూ!" అంటూ ఓ నౌకరు లోపలికి పరుగెత్తి జాడీ తీసుకొచ్చాడు. సీటుక్రింద పదిలపరిచాడు.

అది ఖాళీ జాడీ అని జలదబాలకు తప్పితే మరొకరికి తెలియదు! *

---

A Comment on friendship and a satire on artificial letters. Differences in cultures is evident only on contact.

---

First 12 pages are waste. Story starts on the 13th page.
Not much economy in narration.
Even simple things are explained at length.